
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

శనివారం 6 జూలై 2024

సమస్యలకు సత్వర పరిష్కారం

అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

'మీకోసం'లో గిరిజనులకు నుంచి 184 వినతుల స్వీకరణ



మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు

పాడేరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'మీ కోసం'లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌వో బి.పద్మావతి, ఐటీడీఏ పీవో అభిషేక్‌లతో కలిసి శుక్రవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మీ కోసంలో సమర్పించే అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అలాగే స్వీకరించిన వినతులను సంబంధిత శాఖాధికారులు విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అధిక సంఖ్యలో అర్జీదారులు విచ్చేయడంతో మీ కోసం కార్యక్రమం నిర్వహించే ఐటీడీఏ సమావేశం మందిరం జనంతో కిక్కిరిసింది.

'మీ కోసం'లో 184 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో గిరిజనుల నుంచి అధికారులు 184 వినతులను స్వీకరించారు. సాగు నీటి సమస్యలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, వైద్యారోగ్య సేవలు, అంగన్‌వాడీ కేంద్రాల మంజూరు, భూ సమస్యలు, విద్యాలయాల్లో సీట్ల కోసం ఎక్కువగా వినతులు అందాయి. వీఆర్.పురం మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన కురసం సీత, తన వికలాంగ కుమారుడు బాలాజీకి సదరం సర్టిఫికెట్ జారీ చేయాలని వినతిపత్రం సమర్పించగా, కొయ్యూరు మండలం శరభన్నపాలెంకు చెందిన వికలాంగుడు వనశల వెంకటేశ్వర్లు మూడు చక్రాల స్కూటీని మంజూరు చేయాలని కోరారు. అలాగే జి.మాడుగుల మండలానికి చెందిన మహిళలు వి.సత్యవేణి, కె.జ్యోతి పాడేరు ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీలో ఆన్‌లైన్‌లో బుకింగ్‌తో ఇబ్బందులు పడుతున్నామని, ఆఫ్‌లైన్ విధానం అమలు చేయాలని కోరారు. అలాగే ముంచంగిపుట్టు మారుమూల లక్ష్మీపురం, బరడ, బుంగాపుట్టు పంచాయతీల్లో రోడ్లు నిర్మించాలని, పక్కా తారురోడ్లున్న ... మిగతా 8వ పేజీలో

పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

- అధికారులకు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశం
- ఆస్తి పన్నులను టూరిజం, ప్రభుత్వ శాఖలు చెల్లించాలని సూచన



పర్యాటక అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక శ్రద్ధ కబరచాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పర్యాటకంపై అధికారులు, సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక ప్రదేశాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని, కార్మికులకు అవసరమైన పరికరాలు, దుస్తులు సమకూర్చాలన్నారు. అలాగే ... మిగతా 8వ పేజీలో

కాఫీ దిగుబడులు పెంపునకు ప్రత్యేక కార్యాచరణ

ఎకరానికి 900 మొక్కలుంటేనే అధిక దిగుబడులు

- ప్రతి రైతుకు 250 మొక్కలు ఉచితంగా పంపిణీ
- నాటేందుకు రూ.నాలుగు వేలు ఆర్థిక సాయం
- వచ్చే మూడేళ్లలో ఎకరానికి రెండు టన్నుల కాఫీ దిగుబడి లక్ష్యం
- కాఫీ ప్రాజెక్టు ఏడీ ఎన్.అశోక్



విలేకరులతో మాట్లాడుతున్న కాఫీ ప్రాజెక్టు ఏడీ అశోక్

చింతపల్లి, జూలై 5: గిరిజన ప్రాంతంలో నాణ్యమైన కాఫీ దిగుబడులు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్టు ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీ ఎస్.అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంత రైతులు కాఫీ సాగులో అధిక దిగుబడులు సాధించలేకపోతున్నారన్నారు. దీంతో పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పది వేల ఎకరాల్లో కాఫీ తోటల పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం రైతుల తోటల్లో ఎకరానికి 750లోపు మొక్కలు ఉన్నాయన్నారు. ఎకరానికి 900 మొక్కలు ఉండాలన్నారు. ఈ లోపాన్ని సరి చేసేందుకు ప్రతి రైతు మరో 250 మొక్కలను తోటల్లో నాటుకోవాలన్నారు. అలాగే ఎండుకొమ్మలు, దిగుబడిరాని కొమ్మలు, డెక్క కొమ్మలు తొలగించుకోవాలన్నారు. కలుపు తొలగించుకుని తగినంత నీడ మొక్కలను పెంపొందించుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగును సకాలంలో గుర్తించి నివారించుకోవాలన్నారు. ఐటీడీఏ అందిస్తున్న సాంకేతిక సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతి రైతుకు 250 మొక్కలు ఉచితంగా అందజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ మొక్కలు నాటేందుకు రైతుకు రూ.నాలుగు వేల ఆర్థిక సహాయం అందించనున్నట్టు చెప్పారు. రానున్న మూడేళ్లలో ఎకరానికి రెండు టన్నుల కాఫీ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణను రూపొందించామన్నారు. పీవీటీజీ గ్రామాల్లో రైతులకు ఎకరాకు 50 మొక్కలు రాయితీపై పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాక్స్ చైర్మన్ సెగ్గె కొండలరావు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

ప్రతి వినియోగదారుడూ తీసుకోవచ్చు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- గ్రామాలకూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా
- రూ.1,600 కోట్లతో ఫీడర్ల ఏర్పాటు
- గత ఏడాదిలో 13 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం
- గిరిజన గ్రామాల్లో 35 వేల ఇళ్లకు విద్యుత్ సరఫరాకు రూ.150 కోట్ల వ్యయం
- 8 లక్షల స్మార్ట్ మీటర్ల బిగింపునకు చర్యలు



'ఆంధ్రజ్యోతి'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో ప్రతి గ్రామానికి 24/7 విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. గత ఏడాది కాలంలో డిస్కమ్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. గతంలో రూఫ్‌టాప్ సోలార్ పథకం కింద కిలోవాట్‌కు రూ.16 వేలు రాయితీ ఇచ్చేవారని, ఇప్పుడు దానిని మొదటి మూడు కిలోవాట్లకు రూ.78 వేలకు పెంచారన్నారు. దీనిని ప్రతి విద్యుత్ వినియోగదారుడు తీసుకోవచ్చునని, సంబంధించిన యాప్‌లో సర్వీసు నంబరుతో రిజిస్టర్ కావలసి ఉంటుందన్నారు. ఇప్పుడు పది కిలోవాట్ల వరకు ఎటువంటి ఫీజుబులిటీ రిపోర్ట్ అవసరం లేకుండానే పథకం వర్తింపజేస్తారని, బ్యాంకులు కూడా రుణాలు ఇస్తాయని, డౌన్ పేమెంట్ కింద కేవలం రూ.10 వేలు భరించగలిగితే రూఫ్‌టాప్ సోలార్ పొందవచ్చునన్నారు. విశాఖపట్నం నగరంలో మిగిలిన ప్రాంతాల్లోను అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

13 వేల వ్యవసాయ కనెక్షన్లు

గత ఏడాది కాలంలో డిస్కమ్ పరిధిలో 13 వేల మంది రైతులకు ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఎన్నికల సమయంలో కోడ్ అమలులో ఉండడం వల్ల 2,400 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా మంజూరుచేస్తామని చెప్పారు. వ్యవసాయానికి 9 గంటలు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా 900 ఫీడర్లు ఏర్పాటుచేస్తున్నామని సీఎండీ వివరించారు. ఇప్పుడు గ్రామాలకు కూడా త్రీ ఫేజ్ విద్యుత్ ఇవ్వడానికి ఫీడర్లు మారుస్తున్నామని, ఓవర్‌లోడ్ ఫీడర్లు కూడా గుర్తించి కొత్తవి వేస్తామని, వీటికి కేంద్ర పథకమైన ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా రూ.1,600 కోట్లు వెచ్చించనున్నామని చెప్పారు.

రూ.150 కోట్లతో ఏజెన్సీలకు విద్యుత్ వెలుగులు

రూ.150 కోట్లతో గిరిజన గ్రామాల్లో విద్యుత్ వెలుగులు నింపాలని శ్రీకాకుళం జిల్లా సీతంపేట నుంచి పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్ పురం వరకు 35 వేల ఇళ్లను గుర్తించామన్నారు. వాటిలో 32 వేల ఇళ్లకు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి, మీటర్లు కూడా ... మిగతా 8వ పేజీలో



ఒలింపిక్స్‌కు ఎర్రాజీ జ్యోతి

- నగరం నుంచి ఒలింపిక్స్‌కు ఎంపికైన తొలి అథ్లెట్‌గా రికార్డు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 5: నగరానికి చెందిన అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి భారత్ తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొననున్నది. విశాఖ నుంచి ఒలింపిక్స్‌కు ఎంపికైన తొలి అథ్లెట్‌గా జ్యోతి రికార్డు నెలకొల్పింది. వచ్చే నెల 26 నుంచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించనుంది. వరల్డ్ అథ్లెటిక్స్ సమాఖ్య విడుదల చేసిన ఆటోమేటిక్ క్వాలిఫికేషన్, కటాఫ్ ర్యాంకింగ్స్‌లో 34వ స్థానంలో నిలిచిన జ్యోతి ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్నది. భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పదకొండు (11) మంది అథ్లెట్లలో ఎర్రాజీ జ్యోతి ఒకరు కావడం విశేషం.

100 మీటర్ల హర్డిల్స్‌లో...

టాక్సీ డ్రైవర్ కూతురైన జ్యోతి సాధారణ అథ్లెట్‌గా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టి...క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదలతో సాధన చేసి దేశం గర్వించదగ్గ స్థాయికి చేరుకుంది. 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో జాతీయ స్థాయిలో తన రికార్డులను తానే అధిగమించుకుంటూ దూసుకుపోతోంది. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో స్వర్ణ, రజత పతకాలు అందుకుంది. త్వరలో పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో కూడా దేశానికి పతకం అందించడం ఖాయమని నిపుణులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

హుకుంపేట ఆరోగ్య కేంద్రం కిటకిట

సీజనల్ వ్యాధులతో పెరిగిన తాకిడి



హుకుంపేట ఆస్పత్రికి వచ్చిన రోగులు

- ఒక్క డాక్టర్‌తో పూర్తి స్థాయిలో అందని సేవలు
- రోజూ వారీ ఓపీ 150 నుంచి 200 మంది
- వైద్యులను నియమించాలని వేడుకోలు

హుకుంపేట జూలై 5: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడుతోంది. ప్రతి రోజూ ఓపీ 150 నుంచి 200 వరకు ఉంటున్నది. శనివారం జరిగే సంతనాడు 300 వరకు ఓపీ ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలో ఐదుగురు వైద్యులు ఉండగా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్యుల సంఖ్య తగ్గించారు. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రస్తుతం ఒకే వైద్యాధికారిణి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుత ఎపిడమిక్ సీజన్‌లో రోగులు సంఖ్య పెరుగుతుండడంతో డాక్టర్, వైద్య సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం ఉన్న డాక్టర్ శాంతి రోగుల నుంచి వివరాలు తెలుసుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ ఆస్పత్రికి హుకుంపేట మండలంలోని 364 గ్రామాలు, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాలకు చెందిన మరికొన్ని గ్రామాల రోగులు వస్తుంటారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మలేరియా, డయేరియా వ్యాధులతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని హుకుంపేటలో ఐదుగురు వైద్యులను నియమించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత డాక్టర్ల సంఖ్యను తగ్గించడంతో గిరిజనులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని గిరిజన సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. గతంలో దంత వైద్యుడు ఉన్నప్పుడు రోగులకు పూర్తి స్థాయిలో సేవలందించేవారని, ఇప్పుడు దంత వైద్యుడు లేకపోవడంతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారని వారంటున్నారు. ఒకే డాక్టర్ ఉండడం వల్ల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేకపోతున్నారని, హుకుంపేటలో ఐదుగురు డాక్టర్లను నియమించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, జిల్లా వైద్యాధికారులు స్పందించి వైద్యాధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఊరు దాటాలంటే సాహసం చేయాల్సిందే..

నీటిమూటగా జర్రెల కొత్తూరు వంతెన

- 'గడపగడప'లో హామీ ఇచ్చిన నాటి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- ఐదేళ్లు అయినా ఆచరణకు నోచుకోని హామీ
- కూటమి ప్రభుత్వంలో అయినా వంతెన నిర్మిస్తారని ఆశాభావం



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటుతున్న ఆదివాసీలు

గూడెంకొత్తవీధి, జూలై 5: మండలంలోని జర్రెల కొత్తూరు ఆదివాసీలు వంతెన లేక రాకపోకలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పొరుగు ఊరు వెళ్లాలంటే వాగు దాటాలి. వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో సాహసం చేయాల్సిందే. ఓ మోస్తరు వర్షం కురిసిందంటే చాలు వాగు పొంగి ప్రవహిస్తుంది. అయితే గడపగడపకు వచ్చిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వంతెన నిర్మిస్తానని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. వైసీపీ ప్రభుత్వ పాలకులపై ఆదివాసీలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని జర్రెల కొత్తూరు, రాసకోట గ్రామాల మధ్య వాగు ఉన్నది. జర్రెల కొత్తూరు గ్రామ ప్రజలు చింతపల్లి, జీకేవీధి వచ్చేందుకు ఈ వాగు దాటుకుని వెళ్లాలి. వర్షాకాలం వచ్చిందంటే ఈవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగు పొంగి ప్రవహిస్తున్నది. దీంతో మహిళలు, వృద్ధులు ఈ వాగు దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతానికి వచ్చిన నాటి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కచ్చితంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో వాగుపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. దీంతో వంతెన వస్తోంది.. రవాణా కష్టాలు తీరుతాయని ఆ రెండు గ్రామాల గిరిజనులు సంబరపడిపోయారు. వైసీపీ ప్రభుత్వం పదవీ కాలం ముగిసినా వంతెన ఏర్పాటుకాలేదు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హామీలు నీటి మూటలయ్యాయి. వంతెన నిర్మాణం కోసం ఇచ్చిన హామీని వైసీపీ పాలకులు నిలబెట్టుకోలేదని స్థానిక ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తమకు బ్రిడ్జి వస్తుందనే ఆశాభావంతో గిరిజనులు ఉన్నారు. వాగు దాటేందుకు తాము పడుతున్న అవస్థలను గుర్తించి అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు జర్తా రాజారావు, పొత్తూరు విష్ణుమూర్తి, ముర్ల సంతోశ్ తెలిపారు.

విశాఖలో బుజ్జి



- 'కల్కి' కారు సందడి
- నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు

ప్రభాస్ పాన్ ఇండియా సినిమా 'కల్కి'లో ఉపయోగించిన కారు 'బుజ్జి' విశాఖపట్నంలో సందడి చేస్తోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా దానిని రాష్ట్రం అంతటా తిప్పుతున్నారు. శుక్రవారం ఉదయం నగరానికి తీసుకువచ్చి విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో ఉంచారు. అక్కడి విద్యార్థులకు దానిని ప్రదర్శించారు. శని, ఆదివారాల్లో మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ప్రదర్శిస్తారని సమాచారం. ఈ కారు పేరు 'బుజ్జి'. దీనికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీ ప్రత్యేకంగా తయారుచేసింది. నిర్మాణ వ్యయం రూ.7 కోట్లు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేస్తుంది. అంటే వాయిస్ కమాండ్ ద్వారా ఆపరేట్ అవుతుంది. బుజ్జి బరువు ఆరు టన్నులు. దీనిని ప్రత్యేకమైన ట్రక్కులో రాష్ట్రమంతటా తిప్పుతున్నారు. ప్రదర్శన ఉన్నచోట కిందికి దించి, శిక్షణ పొందిన నిపుణుల ద్వారా డ్రైవ్ చేయిస్తున్నారు. ఈ కారుకు మూడు టైర్లు ఉన్నాయి. ముందు రెండు, వెనుక ఒకటి. ఇవి హబ్ లెస్ టైర్లు. సియట్ కంపెనీ వీటిని ప్రత్యేకంగా రూపొందించింది. డ్రైవర్‌కు స్పెషల్ సీటింగ్ ఉంది. పైన గ్లాస్ డోమ్. కారు పొడవు 6.075 మీటర్లు. వెడల్పు 3.280 మీటర్లు. ఎత్తు 2.186 మీటర్లు. 94 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. రెండు రేంజ్ రోవర్ల శక్తితో సమానమని టెక్నీషియన్లు చెబుతున్నారు. దీనిని చూడడానికి యువతీయువకులు చాలా ఆసక్తి చూపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం విశాఖ వేలీ స్కూల్ ఆవరణలో దీనిని డ్రైవ్ చేసి విద్యార్థులకు చూపించారు. అంతా ఉత్సాహంగా ముందుకు వచ్చి సెల్ఫీలు తీసుకున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

టెన్త్‌లో 'సూపర్ 50'

- ఎంపిక పరీక్షకు 416 మంది హాజరు
- ఐటీడీఏ పీవో వి.అభిషేక్



ఎంపిక పరీక్షల నిర్వహణ పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రత్యేక బోధనకు 'సూపర్ 50' పేరిట నిర్వహించిన ఎంపిక పరీక్షకు 416 మంది గిరిజన విద్యార్థులు హాజరయ్యారని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. గత విద్యా సంవత్సరంలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన 'సూపర్ 50' ప్రత్యేక బోధన విజయవంతమై ఉత్తమ మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మకమైన కళాశాలల్లో వారంతా ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

బైక్‌ను ఢీకొన్న లారీ

» తండ్రి మృతి... కొడుక్కి తీవ్ర గాయాలు

రాంబిల్లి, జూలై 5 : మండలంలోని కొత్తూరు మామిడివాడ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఇన్‌చార్జి సీఐ దీనబంధు తెలిపిన వివరాలివి. ఎలమంచిలి మండలం సోమలింగపాలేనికి చెందిన పిల్లా నాగరాజు (50), అయన కుమారుడు పిల్లా శివ బైక్‌పై కొత్తూరు శుక్రవారం సాయంత్రం వస్తున్నారు. మామిడివాడ వద్దకు చేరేసరికి వీరి వాహనాన్ని లారీ వెనుకనుంచి బలంగా ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే స్థానికులు ప్రైవేటు వాహనంలో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందగా, శివ చికిత్స పొందుతున్నారు. మృతుడి కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

ఏఎల్ పురంలో వృద్ధుడి ఆత్మహత్య

కృష్ణాదేవిపేట, జూలై 5: కాళ్ల నొప్పులు తాళలేక పురుగుల మందుతాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలావున్నాయి. గొలుగొండ మండలం ఏఎల్‌పురం బీసీ కాలనీకి చెందిన ఏకా అప్పలనాయుడు (68) కొంతకాలంగా కాళ్ళ నొప్పు లతో బాధపడుతున్నాడు. గత నెలలో ఎడమకాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయిన ప్పటికీ బాధ తగ్గకపోగా నొప్పి అధికం కావడంతో మద్యంలో పురుగుల మందు కలుపుకొని గురువారం సాయంత్రం ఆత్మహత్యా యత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి, అక్కడ నుంచి నర్సీపట్నం తీసుకెళ్లారు. అనంతరం అక్కడి వైద్యుల సలహా మేరకు కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం అప్పలనాయుడు మృతి చెందారు. మృతుడి భార్య నూకాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

కాలువలో పడి టైలర్ మృతి

ఎలమంచిలి, జూలై 5: పట్టణంలోని నాగేంద్ర కాలనీలో గల డ్రైనేజీ కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతిచెందినట్టు ఏఎస్ఐ చెల్లారావు తెలిపారు. కాలువలో మృతదేహం ఉన్నట్టు శుక్రవారం స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించామన్నారు. పరిశీలించి చూడగా, ఎలమంచిలిలోని నాగేంద్ర కాలనీకి చెందిన జనపరెడ్డి లక్ష్మణరావు (50)గా స్థానికులు గుర్తించారన్నారు. ఇతడు టైలరింగ్ వృత్తి చేసేవాడని, కుటుంబానికి దూరంగా ఉంటున్నాడని వివరించారు. ఇటీవల మద్యం అతిగా సేవించేవాడని, ఆ మత్తులో కాలువలో పడి మృతిచెంది ఉంటాడని తెలిపారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వరహా నదిలో గుర్తుతెలియని మృతదేహం

ఎలమంచిలి, జూలై 5 : మండలంలోని ఏటికొప్పాక సమీపంలో గల వరహా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. శుక్రవారం స్థానికులు నదిలో మృతదేహం ఉన్నట్టు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అందులో పడి ఉన్నాడన్నారు. మూడు రోజులపైడి నదిలో మృతదేహం ఉన్నట్టు భావిస్తున్నామన్నారు. మృతుడు తెల్ల చొక్కా, పంచె ధరించి ఉన్నాడని, అయితే చొక్కాపై నర్సీపట్నం శ్రీకన్య టైలర్స్ స్టిక్కర్ అని ఉందని వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, జూలై 5: పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గోల్డ్‌స్మిత్ మృతిచెందినట్టు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. ఇందుకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు ఆయన తెలిపిన వివరాలివి. కశింకోట గ్రామం సాయిబాబా కోవెల వెనుక నివాసముంటున్న గోల్డ్‌స్మిత్ అములోజు నానాజీ (47) అనకాపల్లి పట్టణంలోని కస్పావీధిలో బంగారు వస్తువుల పనులు చేస్తుంటారు. ఈయన గత నెల 30వ తేదీన అతిగా మద్యం సేవించి, సబ్బవరం రోడ్డులోని పాత గోపాలకృష్ణ థియేటర్ సమీపంలో పడిపోయారు. ఇది గుర్తించిన స్థానికులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి కుమారుడు సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు గంజాయి కేసుల్లో ముగ్గురికి జైలు: ఎస్పీ

కొత్తూరు, జూలై 5: రెండు గంజాయి కేసుల్లో ముగ్గురికి జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. కశింకోట పూసర్లవీధికి చెందిన కొత్తం సూర్యప్రకాశరావు, చోడవరం మండలం ఎడ్ల వీధిలోని పిల్లవారి తోట ప్రాంతానికి చెందిన చొప్ప రమణమ్మకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారన్నారు. రెండో కేసుకు సంబంధించి పాడేరు మండలం గుత్తుల పుట్టు గ్రామానికి చెందిన పాంగి సరస్వతికి ఏడాది జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య తీర్పు ఇచ్చారని ఎస్పీ వివరించారు. కొత్తం సూర్యప్రకాశరావు, చొప్ప రమణమ్మలు 2016 ఆగస్టు 24న తుమ్మపాల ఏలేరు కెనాల్ వద్ద నుంచి కారులో 40 కిలోల గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ మాటువేసి, వారిని పట్టుకుని అరెస్టు చేశారన్నారు. అలాగే, పాంగి సరస్వతి 2015 డిసెంబరు 7న తుమ్మపాల గ్రామం వద్ద బ్యాగులో నాలుగు కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులకు సంబంధించి అనకాపల్లి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శుక్రవారం వాదనలు విన్నతరువాత జడ్జి శ్రీవిద్య తీర్పును వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

10 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

» పరారీలో మరో ఇద్దరు నిందితులు

మాడుగుల రూరల్, జూలై 5: ఏజెన్సీ నుంచి పది కిలోల గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు శుక్రవారం పట్టుబడ్డారు. ఎస్ఐ దామోదర నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో ఎం.కోడూరు గ్రామ శివారుల్లో నడుచుకుంటూ వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా వారి బ్యాగుల్లో పది కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. బిహార్‌కు చెందిన శ్యామ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన షాహిల్, రాకేశ్‌లను అరెస్ట్ చేసి నట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి రవాణాకు సహకరించిన హర్యానాకు చెందిన సునీల్, పాడేరుకు చెందిన అజయ్ పరారీలో ఉన్నారన్నారు. నిందితుల వద్ద సెల్‌ఫోన్, రూ.700 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తలపై దాడి నిందితులకు రిమాండ్

చీడికాడ, జూలై 5: మండలంలోని అప్పలరాజుపురంలో గురువారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడుతో పాటు మరో 8 మందిని పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం అనకాపల్లి జడ్జి ముందు హాజరు పరిచారు. వీరికి న్యాయమూర్తి ఈ నెల 11 వరకు రిమాండ్ విధించారు. శుక్రవారం ఉదయం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలరాజుపురం టీడీపీ కార్యాలయం వద్ద మాడుగుల లోకేష్, స్వామి, కురచా మోదినాయుడు, సూర్యనారాయణలు వారి పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తున్నారు. అదే సమయంలో స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, కురచా నారాయణమూర్తి, కురచా శ్రీను, బండారు బలరాం, మిడతాడ రామకృష్ణ, చుక్క జగదీష్, అక్కునాయుడు, గేదెల సర్వేశ్వరరావు, రమణలు వారిపై దాడిచేసి కొట్టారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం కార్యాలయం వద్దకు వెళ్లి పరిశీలించామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

జంతువుల నుంచి మానవులకు సంక్రమించే రోగాలతో ప్రమాదం

» అప్రమత్తత, ముందు జాగ్రత్త చర్యలతోనే నివారణ సాధ్యం

» నేడు జూనోసిస్ దినోత్సవం

చింతపల్లి, జూలై 5:

భూమి మీద నివసిస్తున్న పక్షులు, జంతువులతో మనుషులు కూడా సంబంధం కలిగి ఉంటారు. తమ అవసరాలకు, ఆహారానికి, ఆనందం కోసం పక్షులు, జంతువులను మచ్చిక చేసుకుంటారు. ఈ తరుణంలో పక్షులు, జంతువుల నుంచి మానవులకు కొన్ని రకాల వ్యాధులు వ్యాప్తి చెందడం ప్రారంభమయ్యాయి. ఈ వ్యాధులను జూనోటిక్(సంక్రమిత) వ్యాధులు అంటారు. పక్షులు, జంతువుల నుంచి మానవులకు సంక్రమించే రోగాలపై ప్రజలు అప్రమత్తం చేసే సదుద్దేశంతో జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పక్షులు, జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

కుక్కల నుంచి ర్యాబిస్, పశువుల నుంచి క్షయ, అకాల ప్రసవ రోగం, చిన్న జీవాల నుంచి ఆంత్రాక్స్ కోళ్ల, పక్షుల నుంచి బర్డ్‌ఫ్లూ తదితర వ్యాధులు మనుషులకు వ్యాప్తి చెందుతాయి. మానవులు శుభ్రత, టీకాలు, కొన్ని నియమాలు పాటించడం వల్ల ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ ర్యాబిస్ వ్యాధికి మొదటి వ్యాక్సిన్ కనుగొనడం వల్ల మానవులకు రక్షణ ఏర్పడింది.

బ్రుసెల్లోసిస్ (అకాల ప్రసవాల వ్యాధి)..



బ్రూసెల్లా వ్యాధి (అకాల గర్భస్రావం)

బ్రుసెల్లోసిస్ వ్యాధి బ్రుసెల్లా అబార్టస్ అనే బాక్టీరియా వల్ల పాడి పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి నోటీ ద్వారా, చర్మం, పొదుగు, వీర్యం ద్వారా ఇతర జంతువులకు వ్యాప్తి చెందుతుంది. పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడం, చనిపోయిన దూడలు పుట్టడం, ఈనిన తరువాత మాయ పడకపోవడం, ఆబోతుల వృషణాలు వాచడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి సోకిన పశువుల యొక్క గర్భాశయ స్రవాలు, చనిపోయిన పిండాలు, వీర్యం తాకడం, పాలు తాడం ద్వారా మనుషులకు ఈవ్యాధి సోకుతుంది. మనుషులలో తరచూ జ్వరం రావడం, చెమటలు పట్టడం, చలి, విపరీతమైన తలనొప్పి, మోకాళ్ల నొప్పులు, గర్భస్రవాలు, పునరుత్పత్తి సామర్థ్యం లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి నివారించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో మన రాష్ట్రంలో బ్రుసిల్లా వ్యాధి నివారణ పథకం(ఎన్‌సీపీబీ) పథకం ద్వారా 4-8 నెలల వయసులో ఉన్న ఆడ దూడలకు టీకాలు ఉచితంగా వేస్తున్నారు.

ఆంత్రాక్స్ (దొమ్మరోగం)



ఈ వ్యాధి గొర్రెలకు, మేకలకు, పశువులకు సోకుతుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ వ్యాధి తీవ్రత అధికంగా ఉంది. మట్టి, కబేళలా ద్వారా, నీరు, ఆహారం, బాహ్యపరాన్న జీవుల వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. బ్రూసిల్లా ఆంత్రాసిస్ అనే బాక్టీరియా ద్వారా ఈవ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ బాక్టీరియా స్పోర్స్ మట్టి, నీరు, ఆహారం, బాహ్య పరాన్న జీవుల శరీరంలోకి చేరి వ్యాధికి కారణమవుతాయి. వ్యాధికి గురైన జంతువులలో లక్షణాలు పెద్దగా కనిపించవు. జ్వరంతో అకాలంగా మరణిస్తాయి. చనిపోయిన పశువు ముక్కు, నోరు, మల ద్వారం నల్లని, గడ్డకట్టన రక్తం కారుతుంది. ఈ వ్యాధి సోకి చనిపోయిన పశువులను అవగాహన లేక చర్మం తీయడం, మాంసం కోయడం వల్ల మనుషులకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన మనుషులకు జ్వరం, చేతులు, కాళ్లపై పొక్కులు (కురుపులు) వస్తాయి. ఈ వ్యాధితో మరణించిన పశువులను ఆరు అడుగుల లోతైన గొయ్యిలో సున్నం, ఉప్పు వేసి పాతిపెట్టాలి. ఈ వ్యాధి నివారించేందుకు పశువులకు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన వారికి వైద్యుల పర్యవేక్షణలో యాంటీబయోటిక్ మందులు వాడాలి.




ర్యాబీస్ (కుక్క కాటు వ్యాధి)



లిస్సా అనే వైరస్ వల్ల ర్యాబీస్ వ్యాధి సోకుతుంది. ఇది జంతువులలో, మనుషులలో కూడా ప్రాణంతమైన వ్యాధి. ఈ వ్యాధి సోకిన కుక్కలు మనుషులను, ఇతర జంతువులను కరవడం వల్ల వ్యాధి వ్యాపిస్తుంది. అకాల మరణం, వెళుతురు చూడలేకపోవడం, నీరు చూసి భయపడడం, అందరినీ కరవడం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఈ వ్యాధి కలిగిన కుక్క మనుషులు, ఇతర జంతువులకు కరిస్తే చొంగ (ఉమ్మి) ద్వారా వైరస్ మనిషిలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. వ్యాధి సోకిన మనుషుల్లో చొంగ కార్చడం, జ్వరం, అరుపులలో మార్పు రావడం ప్రధాన లక్షణాలు. ఈ వ్యాధికి చికిత్సలేదు. వ్యాధిని నిరోధించేందుకు ప్రతీ ఏటా పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. మానవులకు కుక్క కాటువేస్తే వెంటనే గాయానికి శుభ్రంచేసి ప్రథమ చికిత్స చేసి వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సలహా మేరకు కుక్క కరిచిన 0, 3, 7, 14 రోజుల్లో టీకాలు వేయించుకోవడం శ్రేయస్కరం.

బర్డ్‌ఫ్లూ..





కోళ్లలో బర్డ్‌ఫ్లూ

బర్డ్‌ఫ్లూ వ్యాధి ఇన్ ఫ్లుయెంజా వైరస్ వల్ల వస్తుంది. హాంకాంగ్‌లో ప్రారంభమైన ఈ వ్యాధి ప్రపంచమంతా అనాతి కాలంలోనే వ్యాప్తి చెందింది. కోళ్ళు, పక్షుల నుంచి ఈ వ్యాధి మనుషులకు సోకుతుంది. ప్రాణంతకమైన ఈ వ్యాధి సోకిన కోళ్లలో జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, తుమ్ములు, గుడ్లు పెట్టే సామర్థ్యం తగ్గడం, నీరసం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన కోళ్లను తాకడం వల్ల మనుషులకు సోకుతుంది. వ్యాధి సోకిన మనుషుల్లో జలుబు, దగ్గు, జ్వరం, నిమోనియా, గొంతునొప్పి, ఛాతి నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి వల్ల మానవుల ప్రాణానికి ప్రమాదం కలుగుతుంది. వ్యాధి సోకిన మానవులు సకాలంలో చికిత్స పొందాలి. ఈ వ్యాధి కోళ్లలో అరికట్టేందుకు శుభ్రత పాటించడంతో పాటు ఫారంలో బయో సెక్యూరిటీ వ్యవస్థను పాటించాలి.

పశు వైద్యశాలల్లో ఉచితంగా టీకాలు



ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ప్రతీ పశువుల ఆస్పత్రిలో ఉచితంగా ర్యాబీస్ టీకాలు వేయడం జరుగుతుంది. పెంపుడు కుక్కలను ప్రజలు బాధ్యతగా పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి టీకాలు వేయించాలి. ఈ టీకాలు వేయించడం వల్ల ర్యాబిస్ వ్యాధిని నివారించవచ్చు. పశువైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ పెంపుడు జంతువులకు వివిధ సమయాల్లో క్రమంగా టీకాలు వేయించాలి. **-డాక్టర్ విజయ రాజ్ఞి,** పశువైద్య శాస్త్రవేత్త, కేవీకే, హరిపురం.

చక్కని సేవలతో జిల్లా ప్రజల మనసు గెలి'సారు'

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వీడ్కోలు సభలో కొనియాడిన వక్తలు

» తన మార్కు అభివృద్ధిని చూపారని కొత్త కలెక్టర్ విజయకృష్ణన్ ప్రశంసలు

» ఘనంగా సత్కరించిన వివిధ శాఖల అధికారులు



బదిలీపై వెళుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సత్కార సభలో కొత్త కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ, అధికారులు

అనకాపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి చక్కని సేవలందించి ప్రజలందరి మన్ననలు పొందారని నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఉద్యోగులు శుక్రవారం ఏర్పాటు చేసిన బదిలీపై వెళుతున్న రవి పట్టన్‌శెట్టి వీడ్కోలు సభలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లా అభివృద్ధిలో రవి పట్టన్‌శెట్టి తన మార్కును చూపారన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసే విధంగా ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తనకు అన్ని విధాలా సూచనలు, సలహాలు ఇచ్చి సహకరించారని వివరించారు. వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు రవి పట్టన్‌శెట్టి సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా అధికారులు ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

జిల్లాకు 11,660 ర్యాబీస్ వ్యాక్సిన్ డోసులు

» నేడు పెంపుడు కుక్కలకు ఉచితంగా ఇంజక్షన్

» పశు సంవర్ధక శాఖ ఏడీ రాంబాబు



డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం, జూన్ 6 : జూనోసిస్ డే సందర్భంగా నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ కార్యాలయం, పశువుల ఏరియా ఆస్పత్రుల వద్ద శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా ఆ్యబీస్ వ్యాక్సిన్ వేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. జిల్లాకు 11,660 డోసులు మంజూరు అయ్యాయని తెలిపారు. 13 పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలు, అన్ని పశు వైద్య కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. రేబీస్ ఉన్న కుక్క కరవడం వల్ల ఆ వ్యాధి మనుషులు, ఇతర జంతువులకు సోకుతుందన్నారు. కుక్క కరిచిన ఏడు రోజుల నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైనా ఈ వ్యాధి లక్షణాల కనిపించే అవకాశాలు ఉంటాయన్నారు. జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, మింగలేక పోవడం, నీటిని చూస్తే భయపడటం, పిచ్చిగా ప్రవర్తించడం వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. కుక్క కరిచిన వ్యక్తి ఐదు డోసులు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ విషయంలో ఎంతమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టేనని స్పష్టం చేశారు.

మోటూరుపాలెంలో విజృంభిస్తున్న అతిసార

నాలుగు రోజుల క్రితం తొమ్మిది మందికి వాంతులు, విరేచనాలు

వివిధ ఆస్పత్రుల్లో చేరిన మరో 18 మంది బాధితులు

గ్రామాన్ని పరిశీలించి, రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే సుందరపు



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూలై 5 : మండలంలోని మోటూరుపాలెంలో అతిసార విజృంభిస్తోంది. తాజాగా గ్రామానికి చెందిన మరో 18మంది ఈ వ్యాధిబారిన పడగా, చికిత్సలు పొందుతూ వీరిలో ఆరుగురు కోలుకుని ఇళ్లకు చేరారు. మిగిలినవారు అచ్యుతాపురం, అనకాపల్లి, విశాఖ కేజీహెచ్‌లలో చికిత్సలు పొందుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నిల్వ ఉన్న ఆహారం తిన్న కారణంగా మంగళవారం రాత్రి ఓ కుటుంబంలోని తొమ్మిది మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. తొలుత వీరు అచ్యుతాపురంలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో అచ్యుతాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ కొందరికి చికిత్సలు అందించిన అనంతరం ఐదుగుర్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వీరిలో కొందరు గురువారం సాయంత్రం డిశ్చార్జి అయి ఇళ్లకు చేరారు.

కాగా, గురువారం రాత్రి మరో 18 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేశారు. ప్రాథమిక చికిత్సల అనంతరం వీరిలో విశాఖ కేజీహెచ్‌కు ఐదుగుర్ని, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి ముగ్గుర్ని తరలించారు. నాలుగురికి ఇక్కడే చికిత్సలు అందిస్తుండగా, మిగిలినవారంతా కోలుకుని ఇళ్లకు చేరుకున్నారు.

ఇదిలావుంటే, మోటూరుపాలెం ఎస్సీ కాలనీలో 52 గృహాలు ఉండగా, అక్కడ 42 గృహాలకు మరుగు దొడ్లు లేవు, వీరు బహిర్భూమికి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి వెనుకడులు ఏర్పాటుచేసుకొని వినియోగిస్తున్నారు. దీని వల్ల ఈ వ్యాధి ఇతరులకు సోకుతోందని వైద్యబృందం తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

గ్రామంలో అతిసార విజృంభిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం రాత్రి నుంచి పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసుకుంటున్నారు. శుక్రవారం ఆయన మోటూరుపాలెంలో పర్యటించారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి రోగులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. కాగా, తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేష్ కుమార్, అచ్యుతాపురం ఆస్పత్రి వైద్య బృందం సదరు గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నాయకులు బైలపూడి శ్రీరామదాసు, లాలం చందు, జనపరెడ్డి శ్రీనివాసరావు, తుమ్మల రాజు, నీరుకొండ నర్సింగరావులు ఎమ్మెల్యేతో కలిసి వెళ్లి గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

నారు వేసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కొత్తూరు, జూలై 5: వరి నారు వేసే ముందు రైతులు విత్తన శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విత్తనాల బస్తా కొనుగోలు చేసిన రైతులు వంద గింజలను తీసుకొని మొలక కట్టి, మొలక శాతాన్ని పరీక్షించాలన్నారు. 80 శాతానికి మించి మొలకకడితే మంచి విత్తనంగా పరిగణించవచ్చునన్నారు. విత్తన శుద్ధికి కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజం 50శాతం మందును కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలన్నారు. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం యాభై శాతం మందును కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండకట్టి మొలకెత్తిన విత్తనాన్ని దంప నారుమడిలో చల్లుకోవాలని ఆయన సూచించారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే సహించం

కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేసిన హోం మంత్రి అనిత

రాత్రి విద్యార్థినులు భోజనం చేసే సమయంలో రాక

ఆహారం నాణ్యత పరిశీలన.. సమస్యలపై ఆరా



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అనిత

ఎస్.రాయవరం, జూలై 5: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం రాత్రి హోం మంత్రి వంగలపూడి అనిత తనిఖీ చేశారు. విద్యార్థినులు భోజనం చేస్తున్న సమయంలో ఇక్కడికి విచ్చేసిన ఆమె వారితో మాట్లాడారు. భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వంటకాలను పరిశీలించి, రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు వండిపెట్టే భోజనాల్లో నాణ్యత లోపించినా, పరిసరాల పరిశుభ్రత పాటించకపోయినా చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అలాగే విద్యార్థినులకు చక్కగా విద్యాబోధన చేయాలని, మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆమె విద్యాలయంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, ప్రహరీ గోడ లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు మంత్రికి వివరించారు. సమస్యలను పరిష్కరిస్తామని వారికి ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం తహసీల్దార్ చెలమయ్య మృతి



చెలమయ్య (ఫైల్ ఫొటో)

సబ్బవరం, జూలై 5: సబ్బవరం తహసీల్దార్ జె.చలమయ్య గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఎన్నికల ముందు బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల తరువాత అనారోగ్యం కారణంగా రెండు నెలలు సెలవు పెట్టారు. దీంతో పరవాడ తహసీల్దార్‌ను ఇన్ చార్జిగా నియమించారు. అయితే చెలమయ్య పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. తహసీల్దార్ మృతికి మండల పరిషత్ ప్రజా ప్రతినిధులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన మృతికి ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, బోకం రామునాయుడు, కొటాన రాము, గండి రవికుమార్, కర్రి బాబు, పాలిశెట్టి సురేశ్‌రాజ్, యడ్ల నాయుడు బైలపూడి రామారావు, ఐడి బాబు, బోను నాయుడు సంతాపం ప్రకటించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూలై 5: ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూటమి నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. కుమ్మరిపుట్టులోని ఆమె నివాస గృహంలో శుక్రవారం మండల, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పథకం ప్రజల చెంతకు చేరేలా కూటమి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. తద్వారా పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కూడి రామునాయుడు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ సురేష్‌కుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోగి వెంకటరమణ, నాయకులు చల్లంగి లక్ష్మణరావు, డిప్పల వెంకటకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో సీసీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

» సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్


ప్రసాద్‌పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్న సిహెచ్.మురళీ

పాడేరు జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వద్ద సీసీగా పనిచేస్తున్న కె.ప్రసాద్‌పై జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రసాద్, అభిషేక్ సబ్ కలెక్టర్‌గా ఉన్నపుడు సీసీగా చేరారని, ఆయన ఐటీడీఏ పీవో కావడంతో పీవోకు సీసీగా కొనసాగుతూ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో సీహెచ్.మురళీ అనే వ్యక్తి పేర్కొన్నారు. ప్రధానంగా తమిళనాడుకు చెందిన వ్యక్తులకు ప్రభుత్వం భూముల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించేందుకు అవకాశం కల్పించడంతో పాటు తనకు స్థానికంగానే ఇల్లు ఉన్నప్పటికీ డివిజన్ స్థాయి అధికారులు లేదా ఎమ్మెల్యేలకు కేటాయించే ఏ టైపు ఐటీడీఏ క్వార్టర్‌ను పొందడం, అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకుని ప్రభుత్వ భూమిలో మరో ఇల్లు నిర్మించుకోవడం వంటివి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఒక ఐఏఎస్ అధికారికి సీసీగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగిని నియమించుకోవాల్సి ఉండగా, అవుట్‌సోర్సింగ్ విధానంలో చేరిన కంప్యూటర్ ఆపరేటర్‌ను పెట్టుకోవడం సరికాదని, ఆయా అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి సదరు ప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సీలేరు, జూలై 5: దారకొండ పంచాయతీ పరిధిలోని నరమామిడిగొంది గ్రామంలో తాగునీటి సమస్యను ఎరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ గ్రామానికి తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటుచేసిన మంచినీటి పథకం మోటారు బోర్డు కాలిపోయి రెండేళ్లయిందని, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు మండిపడ్డారు. అలాగే సత్యసాయి బాబా ట్రస్టు ప్రతినిదులు గ్రావిటీ ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేశారని, అది మట్టిలో కూరుకుపోయి నీరు రాకపోవడంతో ఐదు రోజులుగా తాగునీటి కోసం తీవ్రమైన ఇబ్బందులను ఎదర్కొంటున్నామని మహిళలు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్‌గా రవీంద్ర


రవీంద్ర

విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు మెట్రోపాలిటన్ కమిషనర్ (ఎంసీ)ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గత రెండేళ్లుగా ఈ సంస్థకు ఎంసీ లేరని, కలెక్టర్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారని, ఆయన బదిలీపై వెళ్లాక కూడా ఎవరినీ నియమించలేదంటూ నాలుగు రోజుల క్రితం 'పెద్ద దిక్కు లేని వీఎంఆర్‌డీఏ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అంతవరకు ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచకుండా ప్రస్తుతం అక్కడే జాయింట్ కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తున్న వి.రవీంద్రకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇస్తూ నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొనసాగాలని సూచించింది. పురపాలక శాఖకు చెందిన రవీంద్ర గత మూడేళ్లుగా వీఎంఆర్‌డీఏలో జాయింట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రాజెక్ట్స్, అకౌంట్స్ విభాగాల బాధ్యతలను నిర్వహించారు. కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ ప్రాజెక్టు నిర్వహణదారు నుంచి రూ.2 కోట్లకు పైగా బకాయి రావలసి ఉంటే దానిని కోర్టు ద్వారా స్వాధీనం చేసుకొని వీఎంఆర్‌డీఏ ద్వారానే నిర్వహిస్తున్నారు. దీనివల్ల గత ఆరు నెలల కాలంలోనే రూ.2 కోట్ల ఆదాయం సంస్థకు సమకూరడం గమనార్హం.

పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

... 5వ పేజీ తరువాయి

పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పర్యాటక శాఖకు చెందిన భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నులను చెల్లించడం లేదని కలెక్టర్ దృష్టికి పంచాయతీరాజ్ అధికారులు తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన టూరిజం, ప్రభుత్వం భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నులను విధిగా చెల్లించాలని, అది ప్రభుత్వ నిబంధన అని సూచించారు. పన్నుల చెల్లింపుల విషయంలో ఎవరూ అతీతులు కాదని, విధిగా చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో గతంలో ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులను పలువురు అధికారులు, సర్పంచులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అవన్నీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కార్యరూపం దాల్చలేదు. మాడగడలో రూ.25 కోట్ల వేంకటేశ్వర స్వామి ఆలయం, గాలికొండ వ్యూపాయింట్ పైకి రూ.14కోట్లతో రోడ్డు నిర్మాణం, చొంపి ప్రాంతంలో రామానాయుడు స్టుడియో నిర్మాణం, గిరిగ్రామదర్శిని అభివృద్ధి, గిరిజన మ్యూజిమంలో బోటింగ్, పద్మాపురం గార్డెన్, రణజిల్లెడ జలపాతం తదితర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస ఫణి, టూరిజం అధికారి దాసు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, పెదలబుడు, పద్మాపురం, మాడగడ, సుంకరమెట్ట పంచాయతీల సర్పంచులు పి.దాసుబాబు, వి.సుస్మిత, ఎం.జ్యోతి, చినబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రత్యేక దృష్టి

... 5వ పేజీ తరువాయి

పెట్టామన్నారు. ఇవన్నీ ఉచిత సర్వీసులేనని గుర్తుచేశారు.

త్వరలో స్మార్ట్ మీటర్లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. మొత్తం పది లక్షల వరకు అవసరం అవుతాయని అంచనా వేశామన్నారు. తొలి దశలో 3 వేల ఫీడర్లు, 1.3 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు, ఆ తరువాత 1.4 లక్షల ప్రభుత్వ సర్వీసులు, ఆపై వాణిజ్య, పరిశ్రమలకు ఈ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తరువాత ఎక్కువ విద్యుత్ వినియోగించే వారికి ఇస్తామన్నారు. తక్కువ విద్యుత్ వాడేవారికి, ఉచిత విద్యుత్ తీసుకునేవారికి ఈ మీటర్ల అవసరం ఉండదన్నారు. ఇవి ప్రీ పెయిడ్ విధానంలో పనిచేస్తాయన్నారు. వీటిని అమర్చిన తరువాత రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ కోతలు విధించకూడదని, డిస్‌కనెక్ట్ చేయకూడదని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ సమయాన్ని 'హ్యాపీ అవర్స్'గా ప్రకటించిందన్నారు.

జిల్లాలో 1.66 లక్షల టన్నులు ఇసుక

» 8వ తేదీ నుంచి విక్రయాలు ప్రారంభం

» జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్


అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్షా 66 వేల టన్నుల ఇసుక సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గుండాల-1 రీచ్‌లో 87,800 టన్నులు, గుండాల-2 రీచ్‌లో 79,026 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి విక్రయాలు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. సీనరేజ్ టన్నుకు రూ.88 మాత్రమేనని, లోడింగ్, పరిపాలనా చార్జీలు, జీఎస్టీ చార్జీలు నిబంధనల మేరకు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. చార్జీలతో కలిపి గుండాల-1 రీచ్‌లో ఉన్న ఇసుక టన్నుకు రూ.292, గుండాల-2 రీచ్‌లో టన్నుకు రూ.237 చెల్లించాలన్నారు. అలాగే ఇసుక విక్రయాలకు గిరిజన అభ్యర్థులతో కూడిన ఏజెన్సీని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, కావూరి చైతన్య, గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ బి.రవికుమార్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు, డీపీవో టి.కొండలరావు పాల్గొన్నారు.

రూ.3 కోట్ల బ్యాంకు లింకేజీ పంపిణీ

జిల్లాలో 75 స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్‌ను జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ శుక్రవారం అందించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిచ్చేందుకు ప్రభుత్వం, బ్యాంకులు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోండి

» అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్

చింతపల్లి, జూలై 5: గిరిజన యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ అన్నారు. శుక్రవారం స్థానిక యువత శిక్షణ కేంద్రంలో ఎస్‌ఐడీబీఐ సౌజన్యంతో అచ్యుతాపురం మహేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసిన వెదురు అల్లికలు తయారీ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన విద్యార్హత లేని యువతీ, యువకులు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలన్నారు. పోలీసు శాఖ ప్రేరణ కార్యక్రమంలో భాగంగా గిరిజన నిరుద్యోగ యువతకు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. తాజాగా మహేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ వెదురుతో ఆఫీస్ ఆర్టికల్స్, ఫర్నీచర్, వెదురు కట్టడాలపై శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చిందన్నారు. తొలివిడతగా ఆసక్తి కలిగిన 100 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన యువతకు పెట్టుబడి నగదు రూ.30వేలు అందజేస్తామన్నారు. వెదురు ఆర్టికల్స్ తయారీపై శిక్షణ పొందడం వల్ల పర్యాటక ప్రాంతమైన లంబసింగి, తాజంగి, చెరువులవేనం, చింతపల్లి ప్రాంతాల్లో స్వయంగా స్టాల్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. అలాగే అమేజాన్, ఫ్లిప్‌కార్టు ద్వారా కూడా మార్కెటింగ్ చేసుకోవచ్చునన్నారు. స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంక్ నుంచి రుణాలు కూడా అందజేస్తామన్నారు. మహేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఎండీ దర్శిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువతకు వెదురు ఆర్టికల్స్ తయారీ శిక్షణ మంచి అవకాశమన్నారు. స్థానిక టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో ఏడాదిపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం, ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని గిరిజనుల ఆందోళన


రోడ్డు నిర్మించాలని ప్ల కార్డులతో నినాదాలు చేస్తున్న గిరిజనులు

పాడేరు రూరల్, జూలై 5: అనంతగిరి మండలంలోని పినకోట, పెదకోట, కవెర్ల పంచాయతీ పరిధిలో 12 గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించే రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు ఆందోళనకు దిగారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల ప్రజలు శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ 12 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పర్చేందుకు 2019-20లో 300 కుటుంబాలకు చెందిన ప్రజలు రెండు నెలల పాటు శ్రమదానంతో సుమారు 13 కిలోమీటర్ల రోడ్డును నిర్మించుకున్నారన్నారు. ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్, ఐటీడీఏ పీవో బాలాజీ రూ.20 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులను వివిధ పనుల పేరిట డ్రా చేసినప్పటికీ అటవీ శాఖాధికారుల అనుమతులు లేవంటూ పనులు చేపట్టలేదన్నారు. వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బోనూరు, చీడిమెట్ట తదితర గ్రామాలకు చెందిన నాయకులు ఎస్.సన్యాసిరావు, పి.బుచ్చన్న, పి.సత్యారావు, బి.చిన్నకొనిల, ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.


ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు బకాయిపడ్డ 17 నెలల వేతనాలు చెల్లించాలని శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పీఎంఆర్సీ భవనం నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీగా వచ్చి, అనంతరం ఐటీడీఏ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో రైతులకు అనేక సేవలు అందిస్తున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ 17 నెలలుగా వేతనాలు అందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీకి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.ఈప్పారావు, బి.సరస్వతి, ఎ.చిట్టిబాబు, కె.వెంకటరావు, డి.సత్యారావు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ

డుంబ్రిగుడ, జూలై 5: మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ డయోరియా నుంచి పిల్లలను కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. ఈ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రాంబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాడేరు రూరల్, జూలై 5: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన సుందరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. నెలకు రూ.16 వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం, రూ.11,200 మాత్రమే చెల్లించిందన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని, యూనిఫాం అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ముత్యాలమ్మ, ఘాటీ, పుణ్యవతి, జ్ఞానమ్మ, నగేష్, చిట్టిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

గూడెంకొత్తవీధి, జూలై 5: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేశ్ అన్నారు. వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి కుంటుబడిపోయిందన్నారు. ఆదివాసీలు కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సమస్యలు తీరుతాయని చెప్పారు.

8, 9 తేదీల్లో కిరండోల్ రైలు రద్దు

విశాఖపట్నం, జూలై 5: వాల్తేరు డివిజన్ పరిదిలోని కేకే లైన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 8న విశాఖ-కిరండోల్ (08551), ఈనెల 9న కిరండోల్ - విశాఖ (08552) రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు.

టెన్త్‌లో 'సూపర్ 50'

... 5వ పేజీ తరువాయి

ప్రవేశం సాధించారన్నారు. దీంతో ఈ ఏడాది సూపర్ 50 శిక్షణ తరగతులు నిర్వహించడానికి చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల-1, శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ పరీక్షకు బాలికలు 209 మంది, బాలురు 207 మంది హాజరయ్యారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి బాలికలకు గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో, బాలురకు దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలోను ప్రత్యేక బోధన అందిస్తామని పీవో అభిషేక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం వద్ద కలెక్టర్ కుటుంబీకుల సందడి


జలపాతంలో కలెక్టర్ పిల్లల కేరింతలు

జి.మాడుగుల, జూలై 5: కొత్తపల్లి జలపాతంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ కుటుంబ సభ్యులు శుక్రవారం సందడి చేశారు. సహసిద్ధంగా ఏర్పాడిన జలపాతం అందాలను కలెక్టర్ కుమారుడు, కుమార్తె ఆస్వాదించారు. జలపాతంలో స్నానాలు చేసి కేరింతలు కొడుతూ సందడిగా గడిపారు.

సమస్యల సత్వర పరిష్కారం

... 5వ పేజీ తరువాయి


అర్జీదారులతో కిటకిటలాడుతున్న ఐటీడీఏ సమావేశ మందిరం

ప్రాంతాలకు ఆర్‌టీసీ బస్సులు నడపాలని లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్ కోరగా, అదే మండలం ఏనుగురాయి పంచాయతీ నడుమూరులో పాఠశాల భవనం శ్లాబ్ వరకు నిర్మించానని, అందుకు బిల్లు మంజూరు చేయాలని కె.గణేశ్వరరావు కోరారు. పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌ను సందర్శించే పర్యాటకుల కోసం పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని కల్లాలబయలు, కొత్తవలస, ఎస్.కొత్తూరు గ్రామస్థులు మర్రి రామారావు, ఎస్.బోడిరాజు, ఎస్.బాలరాజు తదితరులు కోరగా, పాడేరు మండలం ఇరడాపల్లి సర్పంచ్ గుల్లెలి అశ్విజ ఎస్.బొడ్డాపుట్టు గ్రామంలో హుద్‌హుద్ తుఫాన్‌లో చెక్‌డ్యామ్ శిథిలమైందని, పునర్నించాలని కోరారు. అలాగే కొయ్యూరు మండలం మఠంభీమవరం పంచాయతీ పుట్టకోట గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికుడు జె.నాగేశ్వరరావు కోరగా, హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు పక్కా తారురోడ్లు నిర్మించాలని వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, టీడబ్ల్యూ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఆర్‌డీఏ వి.మురళీ, ఎల్‌డీఎం నాయుడు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, కాఫీ ఏడీ అశోక్, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్‌బాషా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కియా కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్

పాడేరు జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కియా కార్ల కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు అభ్యర్థులు బీటెక్ చదివి ఉండాలన్నారు. అలాగే పురుషులు మాత్రమే దరఖాస్తు చేయాలని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.17,500 జీతం ఇస్తారని, అనంతపురం జిల్లా పెనుగొండలో శిక్షణ అందించి ఉద్యోగాల్లో నియమిస్తారని ఆయన చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 6304634447 లేదా 93983 38105 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

పాడేరు జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 8న నిర్వహిస్తామని విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు రొబ్బా నాగభూషణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మోదకొండమ్మ కల్యాణ మండపంలో జరిగే సమావేశంలో నూతన కార్యవర్గం ఏర్పాటుతో పాటు పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని చెప్పారు. పాడేరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులంతా ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని నాగభూషణరాజు కోరారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, జూలై 5: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఈ నెల 10తేదీ వరకు కనిష్ఠంగా 3 ఎంఎం, గరిష్ఠంగా 10 ఎంఎం వర్షపాతం నమోదవుతుందన్నారు. రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని కోరారు.

హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయండి

పాడేరు రూరల్, జూలై 5: హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.సాయి నవీన్ ఆదేశించారు. మండలంలోని డి.గొందూరు పంచాయతీలో శుక్రవారం చేపట్టిన యాసిడ్ లైమ్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఒక రైతు ఎకరాకు 110 యాసిడ్ నిమ్మ మొక్కలను పొందవచ్చని తెలిపారు. అలాగే ఆ రైతు రెండేళ్ల పాటు తన జాబ్ కార్డును ఉపయోగించి వాచ్, వార్డు మొక్కలకు నీరు పోయడం ద్వారా మనుగడ, పెరుగుదలను నిర్ధారించవచ్చని వివరించారు. జిల్లా అధికారులు గిరిజన రైతులు ప్రత్యామ్నాయ పంటలను అనుసరించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. గిరిజన రైతులు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

తపాలా సేవలు వినియోగించుకోండి

అరకులోయ, జూలై 5: తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ చెప్పారు స్థానిక పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పోస్టల్ ఇన్సూరెన్స్, పోస్టల్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర మాట్లాడుతూ తపాల శాఖ అందించే పొదుపు జీవిత బీమా పథకాలను తెలుసుకోవాలన్నారు. అలాగే పోస్టాఫీస్ అందించే సేవలను గురించే విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ పాలసీలలో భాగసామ్యులయ్యేలా తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఇన్సూరెన్స్ పొందే పాలసీలు ఉన్నాయని చెప్పారు. అంతేకాకుండా పలు రకాల స్కీంలు ఉన్నాయని, వాటితో పొదుపు చేసుకునేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. కామర్స్ అధ్యాపకులు రాజు, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మీ, అనితకుమారి, పోస్టల్ సిబ్బంది నాగరాజు, సాయికిరణ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

హుకుంపేట, జూలై 5: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శనివారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నట్టు వైద్యాధికారి శాంతి తెలిపారు. మండలంలోని ఉప్ప, హుకుంపేట పీహెచ్‌సీలకు సంబంధించిన 33 పంచాయతీల్లో పురుషులకు మాత్రమే ఈ చికిత్స చేయనున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కు.ని శిబిరంలో జిల్లా వైద్య నిపుణులు పాల్గొంటారని ఆమె చెప్పారు.

మొక్కలు పంపిణీ

పెదబయలు, జూలై 5: మండల పరిషత్ కార్యలయ ఆవరణ శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీడీవో విగ్గిన్స్ ఆధ్వర్యంలో సిల్వర్ వోక్ మొక్కలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వరహాలమ్మ మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురుస్తున్న సమయంలో మొక్కలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. రైతులు ఎరువులు వేసుకొని మొక్కలను నాటుకోవాలని సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన రైతులకు సకాలంలో వివిధ రకాల మొక్కలను అందించడంతో పాటు వాటి నిర్వహణ బిల్లులు కూడా చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో పూర్ణయ్య, ఏపీవో నాయుడు, సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

దొరగూడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ముంచంగిపుట్టు, జూలై 5: మండలంలోని మారుమూల పెదగూడ పంచాయతీ దొరగూడ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బాకుబెడ నుంచి దొరగూడ వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు రహదారి సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు బలరాం, లక్ష్మణరావు, నాగరాజు, రామక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నామని, రహదారి సౌకర్యం లేకపోవడంతో మార్గమధ్యంలోనే వాహనాలను నిలిచిపోతున్నాయని చెప్పారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రులకు తీసుకువెళ్లేందుకు డోలీ మోత తప్పడంలేదని వాపోయారు. ఏ చిన్నపాటి అవసరానికైనా పంచాయతీ, మండల కేంద్రాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మాణ పనులు జరిగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.